# చాదస్తపు మొగుడు




రావిపల్లి నారాయణ రావు

**రెం**డేళ్ళ కిందట హెడ్‌గుమస్తా ప్రమోషన్ మీద మోహన్‌రాజు కలెక్టర్ ఆఫీసుకు వచ్చాడు. అక్కడ నేను యూడీసీగా పని చేస్తున్నాను. ఈ రెండేళ్ళలో అతను బంట్రోతు దగ్గర నుంచి సెక్షన్ హెడ్ వరకు, ఆఫీసులో అందరికీ సన్నిహితుడైపోయాడు. నిజానికి, ముక్కూ మొహం తెలియని ఏ వ్యక్తితోనైనా పరిచయం చేసుకుని, అతని మెప్పును పొందటానికి మోహన్‌రాజుకు రెండేళ్ళు కాదు - రెండు వారాలు కూడా అక్కర్లేదు. అందరితోనూ మనసువిప్పి మాట్లాడుతాడు. అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాడు. మోహన్‌రాజు ఉన్నచోట వాతావరణం లైవ్లీగా ఉంటుంది. జీతం అందుకున్న మొదటి వారం అతను చాలా హుషారుగా ఉంటాడు. అందరికి టీ ఇప్పిస్తాడు. స్వీట్సు తెప్పించి పంచిపెడతాడు.

స్థానిక 'కళారంజని' నాటక సంస్థకు నేను గౌరవ కార్యదర్శిని. మోహన్‌రాజు ఆ సంస్థ నాటక రచయిత. అందువలన మే మిద్దరం చాలా క్లోజ్‌గా ఉంటాం. ఎప్పుడూ ఏదో ఒక టాపిక్ తీసుకుని మాట్లాడడం అతనికి అలవాటు. అయితే ఏ టాపిక్ తీసుకుని మాట్లాడినా తన భార్య ప్రస్తావన

లేకుండా ఆ టాపిక్ ముగింపు ఉండదు.

"భార్య చాలా గయ్యాళి, ఆమెతో వేగలేక చస్తున్నాను. నేను నాటకాల్లో వేషం వేయకూడదు. ఆఫీసులోనూ, నాటక సమాజంలోనూ ఆడవాళ్ళతో కలసిమెలసి తిరగకూడదు. ఇటువంటి ఆంక్షలు ఎన్నో విధిస్తుంది ఆమె. రేడియో, టీ.వీ. స్టేషన్లకు నాటకాలు పంపకూడదు. అసలు నేను కథలు రాయటం ఆమెకు నచ్చదు. దురదృష్టవశాత్తు రాతప్రతులు ఆమె కంటబడితే వాటి నామరూపా లుండవు. నాటకం రిహార్సల్సు ముగించుకుని రాత్రిపూట ఒక అరగంట ఆలస్యంగా ఇంటికి చేరితే, కడుపులో ఎలుకలు పరుగెడుతున్నా పంచప్రాణాలూ పైకెగిరిపోతున్నా ఆమె లేచి కూడు పెట్టదు. నేను జీవితంలో చేసిన పెద్ద పొరపాటు ఆమెను పెళ్ళి చేసుకోవటం. ఆమె చేతల్లోనే కాదు, ఆకారంలో కూడా రాక్షసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అయినప్పటికీ ఆమెను నేను ప్రేమిస్తుంటాను. ఆరాధిస్తుంటాను. కాని ఆమె ఒక పురుగును చూసినట్టు చూస్తుంది నన్ను."

మోహన్‌రాజు ప్రతి రోజు ఏదో ఒక టాపిక్‌లో తన అర్ధాంగి విషయాల్ని చేర్చి విమర్శిస్తూ ఉండటం నేను గమనిస్తూనే ఉన్నాను. మొదట్లో అతని మాటలు విని దిగ్భ్రాంతి చెందేవాణ్ణి. కాని ఆ తరువాత అతని ధోరణి నాకు అలవాటైపోయింది. పైగా అతను భార్య గురించి ఆఫీసులో అందరి దగ్గరా విమర్శిస్తున్న విషయం తెలుసుకున్నాక అతని పరిస్థితికి ఏడ్వాలో, నవ్వాలో అర్థమయేది కాదు.

సెలవు దొరికితే చాలు మోహన్‌రాజు ఎవరో ఒక ఫ్రెండ్ ఇంటికి వెళ్ళిపోతుంటాడు. ఫామిలీ మెంబర్లా ఆ ఇంట్లో తిరిగేస్తూ, జోక్సు వేసి ఆ ఇంటి దంపతుల్ని నవ్విస్తుంటాడు. ఫ్రెండ్సు ఎవరైనా ఇంట్లో ఉన్న తన శ్రీమతిని మోహన్‌రాజుకు పొరపాటున పరిచయం చేయకపోతే ఆ మర్నాడు ఆఫీసుకు వచ్చి అందరికీ వినిపించేలా ఒక ఉపన్యాసం దంచేస్తాడు - 'ఇంత చాదస్తపు మొగు ళ్ళున్నారా ఈ రోజుల్లో? పెళ్ళాన్ని పరిచయం చేస్తే కొరుక్కుతినేస్తానని భయమా? ఇలాంటి అనుమానపు మనుష లుండబట్టే మహిళా సమాజం ముందుకు పోలేకపోతోంది' - అని.

అతని ఉపన్యాసం విని, 'మనసులో ఏదీ ఉంచుకోడు, నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని బయటపెడ్తాడు మోహన్‌రాజు' - అంటూ అందరూ అతన్ని అభినందిస్తుంటారు.

మోహన్‌రాజు తన ఇంటికి రమ్మని ఎవర్నీ ఆహ్వానించినట్టు గాని, తన భార్యను పరిచయం చేసినట్టు గాని నేను ఇంతవరకూ వినలేదు. మేరేజ్ పార్టీకి గాని, బర్త్‌డే పార్టీకి గాని ఫామిలీని తీసుకుని రండని ప్రత్యేకంగా ఆహ్వానించినా మోహన్‌రాజు ఒక్కడే హాజరవుతాడు కాని భార్యను తీసుకువెళ్ళాడు.

ఆ రోజు ఆదివారం. మ్యాటినీ చూడాలని ప్రశాంత్ సినీమా హాలుకు వెళ్ళాను. టికెట్ కోసం క్యూలో నిలబడ్డాను. మెయిన్‌గేటు దగ్గర ఒక జంట లిమ్కా తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ ఉండటం నా కంట బడింది. ఆ జంటలోని స్త్రీ నావైపు తిరిగి ఉంది. ఆమె వయస్సు పాతికేళ్ళకు మించి ఉండదు. గులాబీరంగు చీర కట్టుకుంది. నల్లటి జాకెట్ తొడిగింది. ఎర్రగా ఉన్న ఆమె ఆ డ్రెస్‌లో మరీ అందంగా కనిపించింది. టికెట్ తీసుకుని హాలువైపు నడక సాగించిన నేను ఆమె పక్కన నిలబడి లిమ్కా తాగుతూ కబుర్లు చెబుతున్న మోహన్‌రాజుని చూసి ఒక క్షణం స్థాణువైపోయాను. అతను నన్ను చూసినా, చూడనట్టు మొహం పక్కకు తిప్పుకున్నాడు.

సినిమాహాల్లో మోహన్‌రాజు, ఆ సుందరి చివరి వరుసలో కూర్చున్నారు. నేను ముందు వరసలో కూర్చున్నాను. ఇంతకీ ఆమె ఎవరు? నాతో మాట్లాడకుండా అతను మౌనంగా ఉండటానికి కారణం ఏమిటి? - నాకు సమాధానం దొరకలేదు. సినిమాహాలు నుంచి బయటపడిన తరువాత నేను పద్మజా హోటల్లో దూరాను.

పవర్‌కట్ వల్ల హోటల్లో కాండిల్స్ పెట్టి అయిటమ్సు సప్లయ్ చేస్తున్నారు సర్వర్లు. మెయిన్‌హాల్లో ఎక్కడా ఖాళీ కుర్చీ కనబడలేదు. దూరంగా ఒక మూల కుర్చీ ఖాళీగా కనిపిస్తే అక్కడకు వెళ్ళి కూర్చున్నాను.

మల్లెపూల వాసన గుప్పుమంది. నా పక్క నున్న టేబుల్ ముందు కూర్చున్న దంపతులు కబుర్లలో పడ్డారు.

మగగొంతు మాటలు నా చెవిని పడ్డాయి - "చూడు రాధా! నా ఫ్రెండ్సు ఎవరికీ నిన్ను పరిచయం ఎందుకు చేయలేదు - అని చాలాసార్లు అడిగావు. ఇప్పుడు నీకు అర్థమై ఉంటుంది, నే నెందుకు చేయలేదో! నా ఫ్రెండ్సు అందరికీ నీ గురించి అబద్ధాలు చెప్పాను. అందమైన ఆడది కనిపిస్తే చాలు కొరుక్కుతినేసేటట్టు చూసే తత్త్వం ఈ మగాళ్ళది. అందుకే మనింటి గడప ఎవరూ తొక్కకుండా చేశాను. సు వ్వొక గయ్యాళివనీ, నరరూపరాక్షసివనీ నమ్మేటట్టు కథలు అల్లేను. అలా చెప్పకుండా ఉంటే ఈసరికి మనిల్లు ఒక ఎగ్జిబిషన్ హాలుగా తయారై ఉండేది. ఏమంటావ్?" అంటూ ఆమె బుగ్గ గిల్లాడు అతను.

అంతలో కరెంట్ వచ్చిందేమో లైట్లన్నీ ఒక్కసారిగా వెలిగాయి. ఆ వెలుగులో ఆమె పక్కసీట్లో కూర్చున్న మోహన్‌రాజు బేరర్‌కోసం వెనక్కు తిరిగి నా మొహం చూసి సిగ్గుతో తల దించుకున్నాడు.

◆

వచ్చే సంచిక నుంచి

పొత్తూరి విజయలక్ష్మి

## 'కలికాలం వంటకాలు'

## న్యాయదర్శనం

### పార్టిషను దావాలో కొత్త సమస్య

మనోహరసింగ్, గణేశ్‌లాల్ అన్నదమ్ములు. వారి తల్లి బదన్‌బాయి. వారిది ఉమ్మడి కుటుంబం. వారికి ఉన్న ఆస్తి ఒక ఇల్లు. ఇంటి మీద తల్లీ కొడుకులకు సమాన హక్కు లున్నాయి.

ఈలోగా గణేశ్‌లాల్ ఋణగ్రస్తుడయినాడు. అతని మీద డిక్రీ అయింది. ఇంటిలో సగం వాటా తనదని చెప్పాడో ఏమో కోర్టువారు అతని సగం వాటాని వేలం వేశారు. ఖుబిలాల్ అనే అతను కొనుక్కున్నాడు.

మనోహరసింగ్ కోర్టులో విభాగాల కొరకు దావా వేశాడు. తనకున్న మూడవ వంతు భాగాన్ని విడదీసి స్వాధీనం చేయవలసినదని అడిగాడు. కోర్టు ప్రిలిమినరీ డిక్రీ ఇచ్చింది. అంటే గణేశ్‌లాల్‌కు మూడవ వంతే ఉందన్న మాట. ఈలోగా అతని భాగాన్ని కొన్న ఖుబిలాల్ చనిపోయాడు. అతని వారసులు అయ్యో సగం వాటా రావల్సింది మూడవ వంతే వస్తున్నదని అప్పీలు చేశారు. అప్పీలు ఆమోదించి కేసును తిరిగి క్రింద కోర్టుకు పునర్విచారణ కొరకు పంపింది.

ఈలోగా బదన్‌బాయి చనిపోయింది. ఆమె కున్న భాగం కొడుకు లిద్దరికీ వచ్చింది. అంటే ఆ ఇంటిలో వారికి చెరిసగం భాగం ఉందన్న మాట. గణేశ్‌లాల్‌కు ఉన్న సగ భాగం ఖుబిలాల్ వారసులు కొట్టేస్తారని దావాను ఉపసంహరించుకుంటున్నానని మనోహర్ సింగ్ కోర్టులో అప్లికేషను పెట్టాడు. కోర్టు దాన్ని ఆమోదించలేదు. మనోహర సింగ్‌కు - ఖుబిలాల్ వారసులకు చెరి సగం హక్కు ఉంటుందని ఆ విధంగా భాగాలు జరగాలని డిక్రీ ఇచ్చింది.

దానిమీద మనోహర సింగ్ హైకోర్టుకు వెళ్ళాడు. వాదికి తను వేసిన దావాను ఎప్పుడంటే అప్పుడు వాపసు తీసుకునే హక్కు ఉన్నదని - అలా క్రింది కోర్టు అంగీకరించకపోవటం తప్పని అతని వాదన. అదీగాక దావా వేసినప్పుడు ఇంటిలో గణేశ్‌లాల్‌కు మూడవ వంతు భాగమే ఉందని సగం కాదని - అందుచేత ఖుబిలాల్ వారసులకు మూడో వంతు మాత్రమే దొరుకుతుందని రెండవ వాదన.

ఇది అన్ని దావాల లాంటిది కాదని పార్టిషను దావా అని ఆస్తిలో హక్కు ఉన్న ప్రతివాదులు కూడా వాదులుగా పరిగణింపబడతారని అందుచేత దావా వేసిన తరువాత వాపసు తీసుకోటానికి వీలులేదని చెప్పింది కోర్టు.

పోతే పార్టిషను దావాలో ప్రిలిమినరీ డిక్రీ పాసుచేసే సమయంలో వాది ప్రతివాదులకు ఎంత హక్కు ఉందో తేల్చాలని దావా వేసిననాటికి కాదని - ప్రిలిమినరీ డిక్రీ ఇచ్చే సమయానికి తల్లి చనిపోయింది కనుకను, ఆమె భాగం ఇరువురి కొడుకులకు వచ్చింది కనుకను గణేశ్‌లాల్‌కు ఉన్న అర్థభాగం ఖుబిలాలు కొనుక్కున్నారు కనుకను క్రింద కోర్టు పాసు చేసిన డిక్రీ సక్రమమేనని రాజస్థాన్ హైకోర్టు తీర్పు చెప్పి అతని దావాను కొట్టివేసింది.

-ఎమ్. ఎస్. శర్మ